ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

శుక్రవారం 28 జూన్ 2024

వర్షంతో ఉపశమనం
- పెరిగిన నక్కవాగు ప్రవాహం 8

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి 8



నిరాశ పరిచిన కేంద్రం మద్దతు ధర

జిల్లాలో వరి, పత్తి, ప్రధాన పంటలుగా రైతులు సాగు చేస్తున్నారు. కేంద్రప్రభుత్వం పంటల మద్దతు ధర నిరాశ పర్చినట్లుగానే ఉంది. 14 రకాల పంటలకు మద్దతు ధర పెంచినా గతేడాది కంటే తక్కువగానే మద్దతు ధర ఉంది. వరి సాదారణ రకానికి గత సంవత్సరం కనీస మద్దతు ధర రూ.2183 ఉండగా ఈ సారి రూ.117 పెంచడంతో రూ.2300కు చేరింది. వరి గ్రేడ్ ఏ రకం రూ.2203 నుంచి రూ.2320 వరకు పెరిగింది. గతేడాది వరికు రూ.143 పెంచింది. పత్తికి రూ.7521 ప్రకటించింది. గతేడాది పత్తికి రూ.540 పెంచగా ఈ సారి రూ.501 మాత్రమే పెంచారు. ఈ సారి మొక్క జొన్నకు రూ.135, కందులలకు రూ.550, పెసర రూ.124, మినుములు రూ.450, వేరుశెనగ రూ. 406 ధరలను పెంచారు. గతేడాది పెంచిన దానితో పోల్చుకుంటే తక్కువగానే ఉండడంతో రైతులు కొంత నిరాశ పడ్డ పెరిగినా సాగు ఖర్చులకు తోడవుతుందని భావిస్తున్నారు.

రుణ ప్రణాళికకు నిరీక్షణ..

- వర్షాకాలం 26 రోజులు గడిచినా ఖరారు కాని బ్యాంక్ రుణ ప్రణాళిక
- వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు
- వ్యవసాయ రంగానికి రూ.732 కోట్లు
- ఈసారి కేంద్రం మద్దతు ధర అంతంత మాత్రమే
- వరికి రూ.117, పత్తి రూ.501

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

కేంద్రం మద్దతు ధర (రూపాయల్లో)

పంట రకం	2022లో	2023లో	పెంపు	2024లో	పెంపు
వరి సాధారణం	2040	2183	143	2300	117
వరి ఏ గ్రేడ్	2060	2203	143	2320	117
పత్తి	6080	6620	540	7121	501
పత్తి (పొడవు పింజ)	6380	7020	640	7521	501
కంది	6600	7000	400	7550	550
పెసర	7555	8558	803	8682	124
మినుములు	6600	6950	350	7400	450
జొన్న (హైబ్రిడ్)	2970	3180	210	3371	191
సజ్జ	2350	2500	150	2625	125
రాగులు	3578	3846	268	4290	444
మొక్కజొన్న	1962	2090	128	2225	135
వేరుశెనగ	5850	6377	527	6783	406
పొద్దుతిరుగుడు	6400	6760	360	7280	520
సోయాబిన్	4300	4600	300	4892	292
నువ్వులు	7830	8635	805	9267	632

రుణ ప్రణాళిక ఖరారు కాకపోవడంతో అన్నదాతలు నిరీక్షిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమై 26 రోజులు గడిచిపోతున్నా బ్యాంకర్లు, అధికారులు జిల్లాకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరం వార్షిక రుణ ప్రణాళికను ఖరారు చేయలేదు. దీంతో రైతులకు వడ్డీ వ్యాపారులే దిక్కవుతున్నారు. కొందరు రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. సహకార, ప్రభుత్వ రంగ బ్యాంకుల అధికారులు రుణ ప్రణాళిక ఖరారు కాలేదని, మార్గదర్శకాలు రాలేదని తిప్పి పంపుతున్నట్లు రైతులు చెబుతున్నారు. గతేడాది సకాలంలో రుణ ప్రణాళిక ఖరారు చేశారు. ఈసారి రుణ ప్రణాళికకు ఎదురు చూసే పరిస్థితులు నెలకొన్నాయి.

గతేడాది ప్రణాళిక రూ.2981.68 కోట్లు

జిల్లాలో వార్షిక రుణ ప్రణాళిక కింద 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1,70,470 అకౌంట్లకు రూ. 2981.68 కోట్లు రుణాలు ఇవ్వాలనే లక్ష్యంగా పెట్టుకు న్నారు.

ఇందులో వివిధ రకాల వ్యవసాయ రంగాలకు సంబంధించి 1,41,211 అకౌంట్ల ద్వారా రూ. 2134.2 కోట్లు. ఇందులో వ్యవసాయ టర్మ్‌లోన్స్ 14,014 మంది రైతుల ఖాతాలకు సంబంధించి రూ.732.2 కోట్లు రుణాలు ఇచ్చే విధంగా లక్ష్యంగా పెట్టుకున్నారు. లక్ష్యాలను చేరడానికి ప్రతిసారి ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. రైతులు గత ప్రభుత్వ హ యాంతో రుణమాఫీ కోసం సకాలంలో చెల్లించకుండా ఎదురు చూసిన సందర్భాలు ఉన్నాయి. 2023 సంవత్సరం వరకు జిల్లాలో 61,343 మంది అర్హులైన రైతులు ఉండగా 40,567 మంది రైతులు రూ.239.90 కోట్లు లబ్ధి పొందారు. ఈ సారి కూడా ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించింది. ఆగస్టు వరకు పూర్తి చేసే దిశగా లక్ష్యంగా పెట్టుకుంది. కానీ ఇంతవరకు రుణ ప్రణాళిక వెల్లడించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో 2.42 లక్షల ఎకరాల సాగు

వర్షాలు ముఖం చాటేసినా రాజన్న సిరిసిల్ల జిల్లాలో రైతులు 2.42 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయడానికి సిద్ధమయ్యారు. ఇందులో ప్రధానంగా వరి 1.83 లక్షల ఎకరాలు, పత్తి 49,215, మొక్కజొన్న 1510, పత్తి 49,215, కందులు 1502, పెసర 348, ఇతర పంటలు 599 ఎకరాలు, ఉద్యాన పంటలు 6900 ఎకరాల్లో సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇందులో ఇప్పటికే 45 వేల ఎకరాల వరకు వరి సాగు చేశారు. పత్తి విత్తనాలు లక్ష్యంలో దాదాపు సగానికి పైగా విత్తనాలు వేసుకున్నా వర్షాలు లేకపోవడంతో మొలకెత్తని పరిస్థితి ఏర్పడింది. నాట్లు కూడా నిలిచిపోయాయి. నారుమడులు ముదిరి పోతున్నాయి. వర్షాలు ఇదే పరిస్థితి ఉంటే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

బద్ది పోచమ్మకు బోనాలు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, జూన్ 27: వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారికి భక్తులు గురువారం బోనాలు సమర్పించారు. ఉదయాన్నే అమ్మవారికి నైవేద్యాన్ని వండుకొని డప్పు చప్పుళ్లు, శివసత్తుల నృత్యాల మధ్య నెత్తిన బోనాలతో ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ఒడిబియ్యం, నైవేద్యాన్ని సమర్పించారు.

ప్రణాళికకు అనుగుణంగా పంటల సాగు

సిరిసిల్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రణాళిక ప్రకారం పంటల సాగు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. జిల్లాలో వ్యవసాయ విస్తీర్ణం, పంటల సాగు, విత్తనాలు, ఎరువులు, రైతు బీమా, రైతు భరోసా, రైతు నేస్తం అంశాలపై గురువారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ వానాకాలం సాగు సజావుగా చేపట్టేందుకు రైతులకు సంపూర్ణ సహకారం అందించాలని, రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని సూచించారు. పత్తి విత్తనాలు బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువుల నిల్వ ఉంచాలని, కొరత రావద్దని అన్నారు. వ్యవసాయ శాఖ పరిధిలో కూరగాయల సాగు, ఆయిల్‌పాం, పండ్లతోటల పెంపకం ప్రణాళిక బద్ధంగా చేపట్టేలా కృషి చేయాలన్నారు. రైతు నేస్తం ద్వారా రైతుల సందేహాలను నివృత్తి చేసుకునేలా చూడాలన్నారు. రైతు బీమా పథకం కింద నమోదై ఏదైనా పరిస్థితుల్లో అన్నదాతలు మరణిస్తే సకాలంలో బీమా సాయం అందేలా చూడాలన్నారు. రైతుల భరోసా పథకం అమలుకు సంబంధించి రైతుల అభిప్రాయాలను క్షేత్రస్థాయిలో సేకరిస్తున్నట్లు, సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిచాలని అన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, ఎల్‌డీఎం మల్లికార్జున్ ఉన్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

బోయినపల్లి, జూన్ 27:జిల్లాలోని ప్రభుత్వ వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. గురువారం ఉదయం బోయినపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో కేవలం ఆయుష్ డాక్టర్, ఫార్మసిస్టులు మాత్రమే హాజరవడం, ఇతర వైద్యులు, సిబ్బంది లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు.

మున్సిపల్ ఉద్యోగులకు భవిష్య నిధిపై అవగాహన

సిరిసిల్ల టౌన్, జూన్ 27 : సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ ఉద్యోగులకు ఈపీఎఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో భవిష్యనిధిపై అవగాహన కల్పించారు. భవిష్యనిధి సంస్థలో ఉన్న ప్రయోజనాలు, లాభాలపై ఉద్యోగులకు ఆప్కే నికత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, కమిషనర్ దుబ్బాక లావణ్య, మేనేజర్ మీర్జా ఫసత్ ఆలీబేగ్, పీయష్ ఎన్ఫోర్స్ మెంట్ ఆధికారి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోనరావుపేట, జూన్ 27 : కోనరావుపేట మండలం ధర్మారం ఎస్సీ హాస్టల్‌లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ధర్మారం ఎస్సీ హాస్టల్లో 100 మంది విద్యార్థులకు సరిపడా సొంత భవనం ఉందని, ఇప్పటికే 55 మంది విద్యార్థులు చేరారని, మరో 45 మంది విద్యార్థులకు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. నేరుగా హాస్టల్‌కు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

1న జిల్లా స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

సిరిసిల్ల టౌన్, జూన్ 27 : అథ్లెటిక్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జూలై 1న సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియంలో జిల్లా స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు గురువారం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిక్కాల రామారావు, ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలలో అండర్-8, 10, 12 వయస్సు ఉన్న బాలబాలికలు మాత్రమే పాల్గొన్నాలని, 50, 100, 300, 400, 600 మీటర్ల పరుగు పందెం పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రతిభ కనబరిచిన బాలబాలికల్లో 15 మంది జూలై 7న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు.

కార్యదర్శి, కారోబార్లకు సన్మానం

తంగళ్లపల్లి, జూన్ 27: వంద శాతం గ్రామపంచాయతీ పన్నులు వసూలు చేసిన కార్యదర్శి కారోబార్లను ఎంపీడీవో జోగం రాజు సన్మానించారు. తంగళ్లపల్లి మండలం దేశాయ్‌పల్లె గ్రామ పంచాయతీకి చెందిన అన్ని రకాల పన్నులు వంద శాతం వసూలు చేసిన గ్రామ కార్యదర్శి స్రవంతి, కారోబార్ హరీష్‌ను మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ దేశాయిపల్లెలో గడువులోగా వంద శాతం పన్నులు వసూలు చేసి మండలంలో గ్రామాన్ని ఆదర్శంగా నిలిపారన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లోని వంద శాతం పన్ను వసూలు చేసి మండలాన్ని జిల్లాలో ఆదర్శంగా నిలపాలని కోరారు.

ద్వాదశ జ్యోతిర్లింగాల ఆలయానికి తాళం

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు



తాళం వేసి ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాల ఆలయం

వేములవాడ కల్చరల్, జూన్ 27: వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన భీమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి ప్రధాన ఆలయం ఉత్తరం వైపున పైభాగంలో ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాల ఆలయానికి ఎప్పుడూ తాళం వేసి ఉండడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ పట్టణానికి చెందిన మామిండ్ల పెంటయ్య అనే భక్తుడు ఉన్నతాధికారుల అనుమతితో జ్యోతిర్లింగాలను ప్రతిష్ఠించినట్లు ఆలయాధికారులు చెబుతున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని భీమేశ్వరస్వామిని దర్శించుకుంటారు. పట్టణ ప్రజలు నిత్యం భీమేశ్వరస్వామి అభిషేక పూజలో పాల్గొంటారు. ఈ క్రమంలో ద్వాదశ జ్యోతిర్లింగాలకు అభిషేకం చేసుకునేందుకు వచ్చిన భక్తులకు చేదు అనుభవం ఎదురవుతోంది. జ్యోతిర్లింగాల ఆలయానికి తాళం వేసి ఉంటోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తాళం తొలగించి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఐసీఈయూ సిరిసిల్ల శాఖ కార్యవర్గం



ఆయిల శ్రీనివాస్



రాపెల్లి శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, జూన్ 27 : ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (భారతీయ జీవిత బీమా సంస్థ ఉద్యోగుల సంఘం) సిరిసిల్ల శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవమైంది. గురువారం సిరిసిల్ల పట్టణంలో ఐసీఈయూ సిరిసిల్ల శాఖ సమావేశం ఐసీఈయూ కరీం నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి వి.వామన్‌రావు, ఉపాధ్యక్షుడు ఎ.రామ్మోహన్‌రావు సమక్షంలో నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఎన్నికల్లో సిరిసిల్ల శాఖ యూనియన్ అధ్యక్షుడు ఆయిల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాపెల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బజార్ శ్రీకాంత్, సహాయ కార్యదర్శులు గంప ప్రణీత్, అరవెల్లి ప్రనయ్, కోశాధికారి పర్వతి మల్లేశం, సభ్యులు కిరణ్, సాయిచంద్ర ప్రకాష్, కావ్య, భూమయ్య, జీసీఎం నాయిని దినకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం సభ్యులను ఐసీఈయూ కరీంనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి వి.వామన్‌రావు, ఉపాధ్యక్షుడు ఎ.రామ్మోహన్‌రావు, సభ్యులు అభినందిచారు. ఈ సందర్భంగా వామన్‌రావు మాట్లాడారు. దేశ ఆర్థిక వ్యవస్థకు తలమానికంగా ఉన్న ఎల్‌ఐసీని అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వ సంస్థల ప్రైవేటీ కరణను ఉద్యోగులు, పాలసీదారులు వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రుణమాఫీకి సన్నద్ధంగా ఉండాలి : కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతు రుణమాఫీ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలతో సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రైతు రుణమాఫీపై బ్యాంకర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 12 డిసెంబరు 2018 నుంచి 9 డిసెంబరు 2023 మధ్యలో పంట రుణాలు తీసుకున్న రైతులకు మాఫీ చేయాలని క్యాబినేట్ నిర్ణయించినట్లు చెప్పారు. ప్రభుత్వం విడుదల చేసే మార్గదర్శకాల ప్రకారం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ ఫలితం చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో వచ్చిన విధంగా సాంకేతిక సమస్యలతో రైతులు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతుల బ్యాంక్ ఖాతాలకు ఆధార్ లింక్ అయ్యేలా చూడాలని ఆధార్ నంబరు ఆధారంగా డూప్లికేట్ బ్యాంక్ ఖాతాలను గుర్తించాలని, శనివారంలోగా నివేదిక ఇవ్వాలని అన్నారు. అంతకుముందు బ్యాంకర్లు పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. 61,343 మంది రైతులు జిల్లాలో రుణాలు తీసుకోగా 40,567 మంది రైతులకు రూ.240 కోట్లు రుణమాఫీ చేసినట్లు, 10,756 మంది రైతులకు సాంకేతిక కారణాలతో రుణమాఫీ జరగనట్లు వివరించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్, డీఏవో భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జితేందర్‌రెడ్డి, మేనేజర్ జితేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేయాలి

జిల్లాలో సీఎంఆర్ లక్ష్యం ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్షించారు. రైస్‌మిల్లులకు రోజువారీ లక్ష్యాలను నిర్ణయించాలని, వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిల్లర్లు సీఎంఆర్ ఎందుకు ఇవ్వడం లేదో తెలుసుకోవాలని, లక్ష్యం చేరుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు.

అర్హులకు 'మహిళా శక్తి' అందించాలి

జిల్లాలోని అర్హులకు 'మహిళా శక్తి' పథకం అందజేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో డీఆర్‌డీవో అధికారులతో సమీక్షించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా జాబ్‌కార్డుల్లో ఎంతమందికి ఉపాధి కల్పిస్తున్నారో అనే విషయాలను ఆరా తీశారు. బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, పీఎంఎఫ్‌ఏ పనుల అంశాలపై చర్చించారు. అంతకుముందు జిల్లాలో 31 ఎస్ఎస్‌జీ గ్రూపులకు, 34,387 యూనిఫాంలను కుట్టించి పంపిణీ చేశామని అధికారులు వివరించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో శేషాద్రి, అదనపు డీఆర్‌డీవోలు శ్రీనివాస్ ఉన్నారు.

సామాజిక పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలి



తరగతిగదిని పరిశీలిస్తున్న డీఈవో రమేష్‌కుమార్

ఇల్లంతకుంట, జూన్ 27: విద్యార్థులు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కస్తూర్బా పాఠశాలలో అన్ని విధాలైన సౌకర్యాలు ఉన్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమయాన్ని వృథా చేయకుండా పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సందేహాలు ఉంటే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు అందించే భోజనంలో మెనూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శిరీష, సీఆర్పీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులందరూ ఉత్తమ ఫలితాల సాధన కోసం ప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ అన్నారు. గురువారం బోయినిపల్లి మండలం విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పాఠశాలలో 10వ తరగతిలో మంచి ఫలితాలు రావడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాలోనే ఆదర్శవంతమైన పాఠశాలగా నిలిచేందుకు పోటీపడాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే విధంగా బోధన సాగాలన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించేలా పాటుపడాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయ బోధన తీరు, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు బొలగం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కట్టుకాలువ హద్దుల ఏర్పాటుకు సర్వే

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



సర్వే చేస్తున్న అధికారులు

వేములవాడ టౌన్, జూన్ 27: వేములవాడ పట్టణంలోని మల్లారం రోడ్డులో కట్టు కాలువకు హద్దులు ఏర్పాటు చేసేందుకు అధికారులు గురువారం సర్వే నిర్వహించారు. మల్లారం రోడ్డులో ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్ ఎదుట ఉన్న కట్టుకాలువ కబ్జాకు గురవుతుండడంతో ఈ నెల 14న 'కట్టుకాలువ కబ్జాకు యత్నం' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సర్వేయర్ రాజేంద్రప్రసాద్‌తో పాటు ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో కాలువ సర్వే చేపట్టారు. కాలువ రెండో బైపాస్ రోడ్డుకు దగ్గరగా ఉండడం, భూములకు ధరలు పెరగడంతో కాలువను ఆనుకొని ఉన్న పట్టణానికి చెందిన కొందరు మొరం పోసి చదును చేశారు. కాలువలో సిమెంట్ కట్టడాలతో కబ్జా చేసేందుకు యత్నించారు. కాలువలోని వరద నీరుకు భూమి కోతకు గురికావద్దన్న నెపంతో కాలువలో సిమెంట్ కట్టడాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో సంబంధిత అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారు. ఈ విషయంపై సర్వేయర్‌ను వివరణ కోరగా పూర్తి స్థాయిలో సర్వే చేసేందుకు మూడు నుంచి నాలుగు రోజుల సమయం పడుతుందని, పాత నక్ష ఆధారంగా ఇక్కడ గొలుసు కట్టు కాలువ ఉందని, సర్వే అనంతరం ఆక్రమణకు గురైన స్థలాన్ని గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని పేర్కొన్నారు.

జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలు ప్రారంభం

- జూలై 2 వరకు అవగాహన కార్యక్రమాలు - విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
-నిజామాబాద్ డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ అంతటి రాజు

గణేశ్‌నగర్, జూన్ 27: ప్రతి సంవత్సరం జూన్ 26 నుంచి జూలై 2 వరకు నిర్వహిస్తున్న జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి, ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలో ప్రజలకు అవగాహన కల్పించాలని నిజామాబాద్ డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ అంతటి రాజు 'ఆంధ్రజ్యోతి'కి గురువారం తెలిపారు.

● వర్షం సమయంలో విద్యుత్ వైర్లను తాకవద్దు..

ఎలక్ట్రికల్ వర్క్స్ లైసెన్స్ కాంట్రాక్టర్ ద్వారా మాత్రమే చేయించాలన్నారు. ఎలక్ట్రికల్ వైర్లు, స్విచ్ గేర్, పరికరాలు ఐఎస్ఐ మార్క్ ఉన్నవి మాత్రమే ఉపయోగించాలన్నారు. అన్ని ఉపకరణాలకు సరియైన ఎర్తింగ్ ఉండాలన్నారు. విద్యుత్ ఉపకరణములను వినియోగించేటప్పుడు రబ్బర్ చెప్పులు లేదా రబ్బర్ షూస్ ఉపయోగించాలని సూచించారు. ఆరుబయట వాడే ఎలక్ట్రికల్ వైర్లు, స్విచ్ బోర్డు మొదలైనవి వాటర్ ప్రూఫ్‌కు సంబంధించినవి మాత్రమే ఉపయోగించాలన్నారు. ఎవరికైనా విద్యుత్ ప్రమాదం జరిగితే వెంటనే విద్యుత్ సరఫరా ఆపి వేసి ప్లాస్టిక్ వస్తువుతో గాని ఎండిన కర్రతో గాని విద్యుత్ ప్రమాదం జరిగిన వ్యక్తిని వేరుచేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ ప్రమాదం జరిగిన వ్యక్తిని సప్లయ్ ఆపివేయకుండా తాకొద్దని తెలిపారు. విద్యుత్ ప్రమాదం జరిగిన వ్యక్తికి వెంటనే ప్రమాద చికిత్స (సీపీఆర్) చేయాలని సూచించారు. వర్షం పడుతున్న సమయంలో తెగిన విద్యుత్ వైర్లను, విద్యుత్ స్తంభాలను తాకరాదన్నారు. విద్యుత్ సరఫరా నిలిపివేసి మాత్రమే కూలర్‌లో నీళ్ళు పోయాలన్నారు. మొబైల్ చార్జర్, ఇతర పరికరాలను సాకెట్ నుంచి తీసేటప్పుడు విద్యుత్ సరఫరా ఆపివేయాలని డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ అంతటి రాజు సూచించారు.

విద్యుత్ వైర్లు తెగి వాహనాలపై పడితే వాహనాలను పట్టుకొని కిందకు దిగరాదని ఆయన అన్నారు. సంబంధిత విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి విద్యుత్ నిలిపివేసిన తరువాతే దిగాలన్నారు. దుస్తులను విద్యుత్ వైర్ల పైన, పరికరాలపైన ఆరవేయవద్దని తెలిపారు. విలువైన విద్యుత్ పరికరాలకు ఎస్‌పీడీ, సర్జ్ ప్రొటెక్టివ్ డివైస్‌ను ఉపయోగించాలని ఆయన సూచించారు. సర్వీస్ వైర్లకు ఎర్తింగ్ చేసిన జీఐ వైర్ సపోర్ట్ ఇవ్వాల అన్నారు. ఎత్తైన బిల్డింగ్స్, హాస్పిటల్, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్, విద్యాసంస్థలు మొదలైన వాటికి మెరుపు రక్షణ (లైట్నింగ్ ప్రొటెక్షన్)ను అమర్చాలని సూచించారు.

● ఎమర్జెన్సీ లైటింగ్ ఉపయోగించాలి..

చిన్న పిల్లల హాస్పిటల్, విద్యా సంస్థల్లో షట్టర్ టైపు సాకెట్ ఔట్‌లెట్లను ఉపయోగించాలని సూచించారు. హాస్పిటల్‌లో రోగికి ఉపయోగించే మానిటరింగ్ ఎక్విప్‌మెంట్, ఇతర ఉపకరణాలకు ఏదైన ఒక సప్లయ్ యూపీఎస్ లేదా రా, పవర్‌లో ఏదో ఒకటి మాత్రమే ఉపయోగించాలని సూచించారు. హాస్పిటల్, షాపింగ్‌మాల్స్, సినిమా థియేటర్లలో ఎమర్జెన్సీ లైటింగ్ ఉపయోగించాలన్నారు. వైరింగ్‌ను ఎఫ్ఆర్, ఎఫ్ఆర్ఎల్ఎస్‌ఎచ్, ఎచ్ఎఫ్ఎఫ్ఆర్ కేబుల్స్‌తో చేయాలన్నారు. దాన్ని ఇతర వైరింగ్‌తో కలపవద్దని ఆయన సూచించారు. గోదాంలలో వైరింగ్‌ను ఉపయోగించరాదన్నారు. తప్పనిసరి అయితే ఐఎస్3594:1991 కోడు ప్రకారం చేయాలన్నారు. ఫైర్ గోదాంలలో ఎట్టి పరిస్థితిల్లోనూ ఎలక్ట్రికల్ వైరింగ్‌ను ఉపయోగించవద్దని వివరించారు. పెట్రోల్ బంక్, ఇతర మండే స్వభావం గల ద్రవ, వాయు ఇంధనాలు/పదార్థాలు ఉన్న చోట ఫ్లేమ్ ప్రూఫ్ ఫిట్టింగ్స్ స్విచ్ బోర్డు, ఎక్విప్‌మెంట్‌లను మాత్రమే ఉపయోగించాలన్నారు. స్విమ్మింగ్ పూల్స్‌లో ఎలాంటి పరికరాలను అమర్చవద్దని డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ అంతటి రాజు సూచించారు.

మల్యాలలో దొంగతనం

మల్యాల, జూన్ 27: మల్యాల మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. కనగర్తి రేణుక అనే మహిళ బుధవారం తన తల్లిగారింటికి వెదిరకు వెళ్లి గురువారం ఉదయం తిరిగి రాగ ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని 17 తులాల వెండి, రెండు గ్రాముల బంగారం, రూ.25వేల నగదు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు.

అలాగే ఇదే మల్యాలకు చెందిన సంగెపు మౌనిక అనే మహిళ ఇంట్లోనూ దొంగతనం జరిగింది. మౌనిక, కుటుంబసభ్యులు మంగళవారం దైవదర్శనానికి తిరుపతికి వెళ్లగా గురువారం ఇంటి తాళాలు తీసి ఉండడంతో పక్కింటి వాళ్లు సమాచా రం అందించారు. దీంతో హుటాహుటిన వచ్చిన మౌనిక కుటుంబస భ్యులు ఇంట్లో చూడగా బీరువా తాళం పగులగొట్టి అందులోని రూ.20వేల నగదు, 20తులాల వెండి, మూడు గ్రాముల బంగారంను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన్నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై-2 కుమారస్వామి తెలిపారు. కాగా ఇరవై రోజుల క్రితం తాటిపల్లిలో రెండిళ్లలో దొంగతనం జరుగగా ఇప్పుడు మల్యాలలోనూ రెండిళ్లలో చోరీ జరిగిం ది. తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా దొంగతనాలు జరుగడం మండల వాసులను ఆందోళనకు గురి చేస్తోంది.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూన్ 27: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,550 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 11మంది రైతులు 230 క్వింటాళ్ల విడి పత్తి, ఆరుగురు రైతులు 13 క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7550 రూపాయలు, కనిష్ఠ ధర 5,000 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

కొండగట్టులో నేడు జ్యేష్టాభిషేకం

మల్యాల, జూన్ 27: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో శుక్రవారం జ్యేష్టాభిషేకం కార్యక్రమంల నిర్వహించనున్నట్లు ఈవో చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా స్వామి వారికి 108 కళాశాలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జ్యేష్టాభిషేకం చేయడం జరుగుతుందని తెలిపారు.

భక్తురాలికి నగదు, సెల్ ఫోన్‌ను అప్పగింత



భక్తురాలి బంధువులకు అప్పగిస్తున్న ఈవో

ధర్మపురి, జూన్ 27: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఒక భక్తురాలు క్యాష్ బ్యాగు, పర్సు, సెల్‌ఫోన్ పోగొట్టుకోగా సిబ్బంది వెతికి ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ద్వారా గురువారం ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎల్లారెడ్డి మండలంలోని మారెడ గ్రామానికి చెందిన ఎన్నం జనార్దన్ రెడ్డి భార్య సుజాత స్థానిక లక్ష్మీనరసింహస్వామి దర్శనం కోసం వచ్చారు. ఉదయం దైవ దర్శనం అనంతరం ఆలయం ఆవరణలో తనకు సంబంధించిన రూ 10,000 విలువ గల సెల్ ఫోన్, క్యాష్ పర్సు, బ్యాగులో మెడిసిన్ పోగొట్టుకుంది. ఆ సెల్ ఫోన్, క్యాష్ పర్సు పెండ్యాల గణేష్ అనే సిబ్బందికి దొరకడంపై విచారణ జరిపి ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ భక్తురాలి కుటుంబ సభ్యులకు అప్పగించారు. భక్తురాలుతో పాటు కుటుంబ సభ్యులు కలిసి ఆలయ సిబ్బందితో పాటు ఈవోకు కృతజ్ఞతలు తెలిపారు.

ఊటూర్ సొసైటీ కార్యాలయం ఎదుట మృతదేహంతో ధర్నా

మానకొండూర్, జూన్ 27 : మండలంలోని ఊటూర్ సహకార సంఘం కార్యాలయం ఎదుట గ్రామస్థులు మృతదేహంతో గురువారం ధర్నా చేశారు. ఊటూర్ సహకార సంఘం ప్రధాన కార్యాలయం లక్ష్మీపూర్‌లో 20 ఏళ్ళుగా అదే గ్రామానికి చెందిన చుక్క రాజయ్య(53) అనే వ్యక్తి హమాలీగా పని చేస్తున్నాడు. కాగా సొసైటీకి ఎరువుల వ్యాన్ రావడంతో రాజయ్యతో పాటు తోటి హమాలీలు ఎరువులు దించుతుండగా ప్రమాదవశాత్తు రాజయ్య కిందపడిపోగా తలకు తీవ్రగాయం అయింది. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అంబులెన్స్‌లో మృతదేహాన్ని గ్రామానికి తరలించి సొసైటీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పాలకవర్గం మృతుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్థులు కొద్దిసేపు ఆందోళన చేశారు. దీంతో మృతుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లిస్తామని పాలకవర్గం హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని తరలించారు. మృతుడికి భార్య మంగమ్మ, కుమారుడు శ్రీనివాస్ ఉన్నారు.



ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

అదనపు కట్నం వేధింపులు..

కూతురుతో బావిలో దూకి తల్లి ఆత్మహత్య

సారంగాపూర్, జూన్ 27: అదనపు వరకట్న వేధింపులు తల్లీకూతుళ్లను బలిగొన్నాయి. పెళ్లి సమయంలో ఇచ్చిన కట్న కానుకలు సరిపోలేదని కూతురు పుట్టినప్పటి నుంచి అత్తింటి వారి నుంచి వేధింపులు పెరగడంతో ముక్కుపచ్చలారని చిన్నారితో సహా ఓ తల్లి బావిలో దూకి తనువు చాలించింది. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని అర్పపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకున్న ఘటన తీవ్ర విషాదం నింపింది. స్థానికులు, ఎస్సై దత్తాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. అర్పపల్లి గ్రామానికి చెందిన బోండ్ల సురేష్‌కు మంగెళ గ్రామానికి చెందిన మౌనిక(28)తో 2020 సంవత్సరంలో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో కట్నం కింద రూ. 5లక్షలతో పాటు ఏడున్నర తులాల బంగారం ముట్టజెప్పారు. దంపతులు ఏడాది పాటు సంతోషంగానే గడిపారు. 2021లో వీరికి కూతురు సాహితి(3) జన్మించింది. కూతురు పుట్టినప్పటి నుంచి రూ. 2 లక్షలు అదనపు కట్నం తేవాలంటూ భర్త సురేష్, అత్త జల, సురేష్ అమ్మమ్మ గంగవ్వ నిత్యం వేధింపు లకు గురిచేయడం మొదలు పెట్టారు. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు సైతం జరిగాయి. వారంరోజుల క్రితం మళ్లీ కట్నం కోసం ఇంట్లో గొడవ జరగటంతో మౌనిక తల్లిగారింటికి బీర్‌పూర్ మండలంలోని మంగేళకు వెళ్లింది. రెండు రోజుల క్రితం భర్త సురేష్ సోదరి చనిపోవడంతో మౌనిక అత్తగారింటికి వచ్చింది. అదే రోజు దంపతుల మధ్య మళ్లీ కట్నం కోసం గొడవ జరిగింది. ఈ విషయం మౌనిక తన అక్క జమునకు ఫోన్ ద్వారా తెలిపింది. తెల్లవారుజామున భర్త లేచి చూసే సరికి ఇంట్లో కూతురు, మౌనిక కనిపించకపోవడంతో బావమరిదికి ఫోన్‌చేసి చెప్పాడు. చుట్టు పక్కల గాలించగా పక్కనే ఉన్న బావిలో చిన్నారితో పాటు మౌనిక శవమై కనిపించారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఎస్సై తన సిబ్బందితో అక్కడకు చేరుకుని మృతదేహాలను పైకి తీశారు. మౌనిక అన్న గంగాధర్ ఫిర్యాదు మేరకు భర్త, అత్త, గంగవ్వలపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దాత్తాద్రి తెలిపారు.



మౌనిక, సాహితి(ఫైల్)

హుజూరాబాద్‌లో కిడ్నాప్ కలకలం

● తన భార్యతో సహజీవనం చేస్తున్నాడని కిడ్నాప్ ● పోలీసుల అదుపులో నిందితులు

హుజూరాబాద్, జూన్ 27: తన భార్యతో సహజీవనం చేస్తున్నాడని సదరు వ్యక్తిని కిడ్నాప్ చేసిన సంఘటన గురువారం హుజూరాబాద్‌లో కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా దేవరకొండ గ్రామానికి చెందిన సతీష్ తన భార్య, ముగ్గురు పిల్లలతో కుటుంబం సాఫీగా సాగుతోంది. ఈ క్రమంలోనే అదే గ్రామానికి చెందిన ధనుష్ అనే యువకుడితో సదరు వివాహిత ప్రేమలో పడి, సంవత్సరం క్రితం ఇద్దరు ఇంటి నుంచి వెళ్లిపోయారు. సతీష్ తన భార్య కోసం సంవత్సరం నుంచి తన బంధువులు, స్నేహితుల సహకారంతో వెతుకుతున్నాడు. అయితే సతీష్ భార్య ధనుష్ అనే యువకుడితో ఆరు నెలల నుంచి హుజూరాబాద్‌లో ఉంటుందని తెలుసుకున్నాడు. గురువారం సతీష్ కారులో తన ఇద్దరు స్నేహితులను తీసుకొని హుజూరాబాద్‌కు వచ్చాడు. ధనుష్ నివాసం ఉండే ఏరియాకు సతీష్ రాగ, చేపల మార్కెట్ వద్ద ధనుష్ కనబడ్డాడు. దీంతో సతీష్ తన కారుతో ధనుష్‌ను ఢీ కొట్టి, బలవంతంగా కారులో ఎక్కించుకొని, పట్టణ శివారులోని కేసీ కెనాల్ వద్దకు తీసుకెళ్లి దాడి చేసినట్లు సమాచారం.

గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు కేసీ క్యాంపు వద్ద నిందితులను పట్టుకున్నారు. సతీష్, ఇద్దరు స్నేహితులను, భార్యను పోలీస్ స్టేషన్‌కు తరలించి, కారును సీజ్ చేశారు. ఈ సంఘట నపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

హుజూరాబాద్‌రూరల్, జూన్ 27: మండలంలోని రాజపల్లి గ్రామపంచాయతీ సమీపంలోని గొల్లపల్లి వద్ద గురువారం ఓ ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డం రావడంతో బైక్‌పై నుంచి ఓ వ్యక్తి కిందపడగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా సమీపంలోని ఆజామ్‌నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ వొడితల శ్రీనివాస్ తన ద్విచక్ర వాహనంపై హుజూరాబాద్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనం గొల్లపల్లి వద్దకు చేరుకోగానే ఓ కుక్క అడ్డం రావడంతో బైక్ అదుపుతప్పి కిందపడటంతో కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా శ్రీనివాస్ కొన్ని నెలలుగా హుజూరాబాద్‌లో లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నట్లు అతడి స్నేహితులు తెలిపారు.

సెన్సెక్స్ 79,000 పైకి..
24,000 స్థాయికి నిఫ్టీ

- సరికొత్త ఉన్నత శిఖరాలకు సూచీలు
- నాలుగో రోజూ లాభాల బాటలో మార్కెట్
- రూ.438.41 లక్షల కోట్లకు మదుపరుల సంపద

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో గురువారం రికార్డుల మోత మోగింది. వరుసగా నాలుగో రోజూ ర్యాలీ తీసిన ప్రామాణిక సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ తొలిసారిగా 79,000 మైలురాయిని చేరగా.. నిఫ్టీ 24,000 మార్క్‌ను దాటింది. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ఐటీ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను మరింత ముందుకు నడిపించాయి. సెన్సెక్స్ ఒక దశలో 721.78 పాయింట్లు ఎగబాకి 79,396.03 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. ట్రేడింగ్ నిలిచేసరికి, సూచీ 568.93 పాయింట్ల లాభంతో 79,243.18 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఒక దశలో 218.65 పాయింట్ల వృద్ధితో 24,087.45 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివర్లో 175.70 పాయింట్ల లాభంతో 24,044.50 వద్ద కొత్త జీవిత కాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది.

ఈ మంగళవారం 78,000 స్థాయికి చేరిన సెన్సెక్స్.. కేవలం రెండు ట్రేడింగ్ సెషన్లలోనే మరో 1,000 పాయింట్ల మేర పుంజుకుంది. గత నెల 24న తొలిసారిగా 23,000 మైలురాయిని తాకిన నిఫ్టీ, కేవలం 23 ట్రేడింగ్ సెషన్లలో మరో 1,000 పాయింట్లు వృద్ధిని కనబరిచింది. మార్కెట్ జైత్రయాత్రలో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం సరికొత్త జీవిత కాల గరిష్ఠ స్థాయి రూ.438.41 లక్షల కోట్లకు (5.25 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,033.28 పాయింట్లు (2.63 శాతం) పుంజుకోగా.. మార్కెట్ సంపద రూ.3.93 లక్షల కోట్లు పెరిగింది.

వచ్చే నెల 3 నుంచి ఎమ్‌క్యూర్ ఫార్మా ఐపీఓ

అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బెయిన్ క్యాపిటల్ పెట్టుబడులు కలిగిన ఎమ్‌క్యూర్ ఫార్మా తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చేనెల 3న ప్రారంభమై 5న ముగియనుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.800 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 1.14 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. వచ్చేనెల 10న కంపెనీ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే అవకాశం ఉంది.

జేపీ మోర్గాన్ బాండ్ ఇండెక్స్‌లోకి భారత ప్రభుత్వ సెక్యూరిటీలు

భారత ప్రభుత్వ బాండ్లు (జీ-సెక్) శుక్రవారం నుంచి జేపీ మోర్గాన్-ఎమర్జింగ్ మార్కెట్ బాండ్ ఇండెక్స్‌లో భాగం కానున్నాయి. వచ్చే 10 నెలల (2024 జూన్ 28 నుంచి 2025 మార్చి 31) కాలంలో ఈ సూచీలో చేరనున్నాయి. నెలకు ఒక శాతం చొప్పున పది నెలల్లో గరిష్ఠంగా సూచీలో 10 శాతం వెయిటేజీ వరకు భారత జీ-సెక్‌లను సూచీలో చేర్చనున్నారు. తద్వారా వచ్చే పది నెలల్లో మన ప్రభుత్వ బాండ్లలోకి కనీసం 2,000-2,500 కోట్ల డాలర్ల మేర విదేశీ పెట్టుబడులు రావచ్చని అంచనా. దాంతో మన జీ-సెక్‌ల రేట్లు తగ్గడంతో ప్రభుత్వానికి రుణ సమీకరణ వ్యయం కూడా తగ్గనుందని విశ్లేషకులు పేర్కొన్నారు.

ఇండియా సిమెంట్స్‌లో అల్ట్రాటెక్ పాగా

రూ.1,900 కోట్లతో 23% వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: దేశీయ సిమెంట్ రంగంలో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. తాజాగా ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ అల్ట్రాటెక్ సిమెంట్.. చెన్నై కేంద్రంగా ఉన్న ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 22.77 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.1,889.27 కోట్లు చెల్లించింది. డీమార్ట్ ప్రమోటర్ రాధాకృష్ణ దమానీ, ఆయన కుటుంబ సభ్యుల నుంచి అల్ట్రాటెక్ 2 బ్లాక్ డీల్స్ ద్వారా ఈ వాటాలు కొనుగోలు చేసింది. ఇందుకోసం మొదటి బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.265 చొప్పున, రెండో బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.285 చొప్పున చెల్లించింది.

ముందు చూపుతోనే: ఇది కేవలం పెట్టుబడి లాభాల కోసం జరిపిన కొనుగోలు అని అల్ట్రాటెక్ చెబుతోంది. అయితే ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఇండియా సిమెంట్స్‌ని ఎలాగైనా కైవసం చేసుకునే వ్యూహంతోనే అల్ట్రాటెక్.. ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 23 శాతం వాటా కొనుగోలు చేసిందని భావిస్తున్నారు. గతంలో బీవీ రాజు నిర్వహణలోని రాశి సిమెంట్, విష్ణు సిమెంట్ టేకోవర్ కోసం గతంలో ఇండియా సిమెంట్స్ కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించింది. ముందు పెట్టుబడి లాభాల కోసమే అంటూ, ఈ రెండు కంపెనీల ఈక్విటీలో కొంత వాటా కొనుగోలు చేసింది. తర్వాత బీవీ రాజు బంధువుల నుంచి మరింత వాటా కొనుగోలు చేసి ఈ రెండు సంస్థలను కైవసం చేసుకుంది. ఇండియా సిమెంట్ ఈక్విటీలో ఇప్పటికీ ప్రధాన ప్రమోటర్ ఎన్ శ్రీనివాసన్‌కు, ఆయన నిర్వహణలోని ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలకు 28 శాతం వాటా ఉంది. మిగతా 49 శాతం వాటా రిటైల్ మదుపరులు, సంస్థాగత మదుపరుల చేతుల్లో ఉంది.

జియో సేవలు మరింత ప్రియం

27% వరకు టారిఫ్‌ల పెంపు

జూలై 3 నుంచి అమల్లోకి

స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరునాడే వడ్డింపు

జియో బాటలో మిగతా టెల్కోలు!



న్యూఢిల్లీ: టెలికాం రంగంలో టారిఫ్‌ల పెంపు మళ్లీ ప్రారంభమైంది. ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ జియో ఇందుకు నాంది పలికింది. తన ప్లాన్స్‌లోని అన్ని మొబైల్ టారిఫ్స్‌ను 12 నుంచి 27 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. ఈ పెంపు జూలై 3వ తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. రెండున్నర సంవత్సరాల తర్వాత జియో తన మొబైల్ టారిఫ్స్‌ను పెంచడం ఇదే మొదటిసారి. '5జీ, ఏఐ టెక్నాలజీల్లో పెట్టుబడుల ద్వారా స్థిరమైన అభివృద్ధి కోసం టారిఫ్‌లు పెంచుతున్నాం' అని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా అన్‌లిమిటెడ్ ఉచిత 5జీ సర్వీసులను కొన్ని ప్లాన్స్‌లోని కస్టమర్లకే కంపెనీ పరిమితం చేసింది. స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరుసటి రోజే రిలయన్స్ జియో టారిఫ్‌లు పెంచడం విశేషం. దీంతో మిగతా టెలికాం కంపెనీలు త్వరలోనే రిలయన్స్ జియోను అనుసరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

పెంపు ఇలా: ప్రస్తుతం రూ.15గా ఉన్న ఒక జీబీ డేటా యాడ్ ఆన్ ప్యాక్ ధరను రూ.19కు (27 శాతం) పెంచింది. 75 జీబీ పోస్ట్ పెయిడ్ డేటా ప్లాన్ టారిఫ్‌ను రూ.399 నుంచి రూ.449కి పెంచేసింది. ఇక అత్యంత ప్రజాదరణ పొందిన 84 రోజులు చెల్లుబాటయ్యే రూ.666 అన్‌లిమిటెడ్ ప్లాన్ టారిఫ్‌ను రూ.799కి (20 శాతం) పెంచేసింది. ఏడాది పాటు చెల్లుబాటయ్యే వార్షిక పథకాల టారిఫ్‌లనూ రూ.1,559 నుంచి రూ.1,899కి, రూ.2,999 నుంచి రూ.3,599కి పెంచింది. రోజుకి 2 జీబీ లేదా అంతకంటే ఎక్కువ జీబీ ప్లాన్స్‌లో ఉన్న ఖాతాదారులకు అపరిమిత 5జీ డేటా లభిస్తుందని తెలిపింది.

ఉచితంగా రెండు యాప్స్

టారిఫ్‌ల పెంపుతో పాటు తన ఖాతాదారుల కోసం రిలయన్స్ జియో రెండు ప్రత్యేక యాప్స్‌ని అందుబాటులోకి తెచ్చింది. జియో సేఫ్, జియో ట్రాన్స్‌లేట్ అనే ఈ రెండు యాప్స్ ఏడాది పాటు జియో ప్రస్తుత ఖాతాదారులకు ఉచితంగా అందుబాటులో ఉంటాయి. ఇందులో జియో సేఫ్ యాప్ ద్వారా సురక్షితంగా కాల్స్, మెసేజ్‌లు, ఫైల్స్ ట్రాన్స్‌ఫర్‌తో సహా అనేక పనులు చేయవచ్చని తెలిపింది. ఇక కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత జియో ట్రాన్స్‌లేటర్‌యాప్ ద్వారా వాయిస్ కాల్స్, వాయిస్ మెసేజ్‌లు, టెక్స్ట్, ఇమేజ్‌లను వివిధ భాషల్లోకి తర్జుమా చేయవచ్చు. కొత్తగా చేరే ఖాతాదారులు మాత్రం ఈ యాప్స్‌కి నెలకు రూ.99 నుంచి రూ.199 వరకు చెల్లించాలి.

2024-25లో ఫార్మా ఎగుమతుల్లో 10% వృద్ధి

రూ.2.6 లక్షల కోట్లుగా నమోదయ్యే చాన్స్

ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత్ నుంచి 3,100 కోట్ల డాలర్ల (దాదాపు రూ.2.6 లక్షల కోట్లు) ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి కావచ్చని ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) అంచనా వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఫార్మా ఎగుమతులు 2,785 కోట్ల డాలర్లు (రూ.2.32 కోట్లు)గా ఉన్నాయని, 2024-25లో ఇవి 10-12 శాతం వరకు వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని భావిస్తున్నట్లు ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్ వెల్లడించారు. గురువారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-మే నెలల కాలంలో ఫార్మా ఎగుమతులు 8.85 శాతం వృద్ధితో 435 కోట్ల డాలర్ల నుంచి 473 కోట్లకు పెరిగాయని తెలిపారు. ఎగుమతులపరంగా కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ నిర్దేశిత ఎగమతుల లక్ష్యాలను చేరుకుంటామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆఫ్ పేటెంట్ ఔషధాలతో అపార అవకాశాలు

2023 నుంచి 2029 వరకు అంతర్జాతీయంగా 15 బ్లాక్‌బస్టర్ ఔషధాల పేటెంట్ గడువు తీరిపోనుందని, ఈ ఔషధాలతో భారత ఫార్మా పరిశ్రమ అపారమైన అవకాశాలు దక్కించుకునే వీలుందని ఉదయ్ భాస్కర్ తెలిపారు. ఈ ఆఫ్-పేటెంటెడ్ ఔషధాల విలువ దాదాపు 11,200 కోట్ల డాలర్లుగా ఉందని, ఇందులో భారత కంపెనీలు 1,000 కోట్ల డాలర్ల వరకు అవకాశాలను అందుకునే అవకాశం ఉందన్నారు. కాగా ప్రస్తుతం దేశీయ ఫార్మా కంపెనీలు.. అంతర్జాతీయ రెగ్యులేటరీ సంస్థల నుంచి కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నాయని, చాలా వరకు ఇవి నాణ్యతకు సంబంధించినవిగా ఉంటున్నాయని వివరించారు. అయితే ఈ సమస్యను అధిగమించేందుకు ఫార్మెక్సిల్ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

నట్టేట ముంచే పెట్టుబడి సలహాదారులకు చెక్!

- సెబీ నియంత్రణలోకి ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్స్
- అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్లకు కొత్త నియమావళి
- డెరివేటివ్స్‌లో స్టాక్స్ ఎంట్రీకి కఠిన నిబంధనలు
- సెబీ బోర్డులో పలు కీలక నిర్ణయాలు



ముంబై: డిజిటల్ మాధ్యమాల ద్వారా ఆర్థిక పెట్టుబడులపై సలహాలిచ్చే ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్ల (ఫిన్‌ఫ్లుయెన్సర్స్)ను నియంత్రించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిర్ణయించింది. అన్‌రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్ కోసం నియమావళిని విడుదల చేసింది. అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో సెబీ నమోదిత కంపెనీలు, వారి ఏజెంట్లు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా భాగస్వాములు కాకుండా నిషేధం విధించింది. గురువారం సమావేశమైన సెబీ బోర్డు ఈ ప్రతిపాదనను ఆమోదించింది. పక్షపాతంతో, పక్కదోవ పట్టించే సలహాలిచ్చే ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో నియంత్రణ మండలి తాజా చర్యలు చేపట్టింది. ఎందుకంటే, పెట్టుబడులు, మదుపు కోసం ఫిన్‌ఫ్లుయెన్సర్ల సలహాలపై ఆధారపడే చిన్న మదుపరుల సంఖ్య గడిచిన కొన్నేళ్లలో భారీగా పెరిగింది. సెబీ కొత్త నియమావళి ఫిన్‌ఫ్లుయెన్సర్లను వారిచ్చే సలహాలకు బాధ్యులుగా, జవాబుదారీగా చేయనుంది. అంతేకాదు, సెబీ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు (ఐఏ), రీసెర్చ్ అనలిస్టులు (ఆర్ఏ) తమ క్లయింట్ల నుంచి రుసుము వసూలు చేసేందుకు క్లోజ్డ్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని కూడా నియంత్రణ మండలి నిర్ణయించింది.

అప్పు చేసి ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్: బుచ్

ఏదైనా కంపెనీ షేరును డెరివేటివ్ ట్రేడింగ్‌లో చేర్చడం లేదా తొలగించడానికి సంబంధించిన అర్హత నిబంధనలను సెబీ కఠినతరం చేసింది. నిత్యం తక్కువ టర్నోవర్ కలిగిన స్టాక్స్‌ను ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) విభాగం నుంచి ఏరివేసేందుకు ఇది దోహదపడనుంది. అంతేకాదు, ఎఫ్ అండ్ ఓ విభాగ ట్రేడింగ్‌పై సమీక్ష జరిపేందుకు సెబీ 15 మంది సభ్యులతో కూడిన నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మూడు కోణాల్లో (మార్కెట్ అభివృద్ధి, ఇన్వెస్టర్ల సొమ్ముకు రక్షణ, పొంచి ఉన్న ముప్పులు) ఎఫ్ అండ్ ఓ మార్కెట్‌ను సమీక్షించనుందని బోర్డు భేటీ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ తెలిపారు. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల పాత్ర పెరగడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చన్నారు. చిన్న ఇన్వెస్టర్లు అప్పు చేసి మరీ ఎఫ్ అండ్ ఓలో ట్రేడింగ్ నెరుపుతున్నారని, కుటుంబ పొదుపు సొమ్మునూ కరిగించేస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఏమాత్రం మంచిది కాదన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,730 ▼	65,750 ▼	94,500 ▼
ముంబై	71,391 ▲	65,394 ▲	87,043 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	520
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	123
వరంగల్	110	గుంటూరు	123
కరీంనగర్	110	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	130
కర్నూలు	110	నెల్లూరు	130
విశాఖపట్నం	129	అనంతపురం	123
గోదావరి	123		

ఢిల్లీలోని ఒవైసీ ఇంటి నేమ్ ప్లేట్‌పై సిరా చల్లి పారిపోయిన దుండగులు

» ఒవైసీ మండిపాటు.. అమిత్‌షా చేయిస్తున్నారని ఆరోపణ

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మజ్లిస్ అధ్యక్షుడు, పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఢిల్లీలోని ఇంటి ఆవరణలో ఉన్న నేమ్ ప్లేట్‌పై ఇద్దరు దుండగులు సిరా చల్లి పారిపోయారు. ఈ ఘటనకు సంబంధించి సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాలను ఎక్స్‌లో పంచుకుంటూ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిని నిరోధించడంలో ఢిల్లీ పోలీసుల విఫలం అయ్యారని మండిపడ్డారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పర్యవేక్షణలోనే ఇవి జరుగుతున్నాయని ఆరోపించారు. ఎంపీలకు తగిన భద్రత ఉంటుందో లేదో స్పష్టం చేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ప్రశ్నించారు. ఇంటిపై సిరా చల్లడం, రాళ్లు రువ్వి పారిపోవడం పిరికిపందల చర్య అని, ఇలాంటి వాటికి తాను భయపడనని స్పష్టం చేశారు. ధైర్యం ఉంటే నేరుగా తనను ఎదుర్కోవాలని ఒవైసీ సవాల్ విసిరారు.

బియ్యం ఇచ్చేందుకు.. మిల్లర్లకు మరో 90 రోజుల సమయం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకుని బియ్యం(సీఎంఆర్) ఇవ్వని మిల్లర్లకు మరో 90 రోజుల పాటు గడువు ఇస్తూ సర్కారు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ గురువారం జీవో జారీ చేశారు. ఈ పొడిగింపు 2019-20, 2020-21 యాసంగి సీజన్, 2021-22 వానాకాలం, యాసంగి, 2022-23 వానాకాలం సీజన్ సీఎంఆర్ బకాయిలకు వర్తిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సీఎంఆర్ ధరకు 125 శాతం లేదా 12 శాతం వార్షిక వడ్డీ రేటు.. ఇందులో ఏది ఎక్కువైతే అది నగదు రూపంలోనైనా, బియ్యం రూపంలో(స్టేట్ పూల్‌కు)నైనా రికవరీ చేయవచ్చని పేర్కొన్నారు. గడువులోగా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తే మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. మిల్లర్లకు ధాన్యం మిల్లింగ్‌కు అనుమతి ఇవ్వకుండా అనర్హత వేటు వేస్తామని స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్, అన్ని జిల్లాల మేనేజర్లు, పౌర సరఫరాల సంస్థ అధికారుల సమన్వయంతో ఈ రికవరీ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.

నిబ్రస్ డ్రోన్లకు డీజీసీఏ ఆమోదం

» భూ సర్వే అవసరాలు తీర్చేలా ఆధునిక ఫీచర్లు



హైదరాబాద్ సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అధునాతన ఫీచర్లతో భూమి సర్వేకు నిబ్రస్ టెక్నాలజీస్ సంస్థ రూపొందించిన డ్రోన్ సర్వేయాన్ వి1కు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆమోద ముద్ర వేసింది. 1.99 కిలోల బరువుండే ఈ డ్రోన్‌కు అధిక తరంగ ధైర్ఘ్యం (హై రెజుల్యూషన్) కలిగిన 23 మెగా పిక్సల్ కెమెరా అమర్చి ఉంటుంది. ఫలితంగా అత్యంత స్పష్టమైన చిత్రాలు, డేటాను సేకరించగలదు. గంటకు 25 కిలోమీటర్ల వేగంతో గాల్లో ఎగరగలదు. వేగంగా విస్తరిస్తున్న డ్రోన్ టెక్నాలజీ రంగంలో తమ ఉనికి చాటుకునేలా అధునాతన ఉత్పత్తులను రూపొందిస్తున్నట్లు నిబ్రస్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు శుభం భరన్వాల్ తెలిపారు. సర్వే పరిశ్రమలో సర్వేయాన్ వీ1డ్రోన్ విప్లవాత్మక మార్పులకు కారణమవుతుందనే విశ్వాసం వ్యక్తంచేశారు.

ఆడపిల్ల వద్దంటూ.. ఏడో నెలలో అబార్షన్

తల్లి ప్రాణానికే ముప్పని వైద్యులు చెప్పినా వినని భర్త

» ఆర్ఎంపీ సహాయంతో భార్యకు మామిడితోటలో గర్భస్రావం చేయించి ఆమె ప్రాణాలు బలిగొన్న వైనం
» సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో విషాద ఘటన



సూర్యాపేట పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన సుహాసిని తల్లిదండ్రులు, బంధువులు



సుహాసిని (ఫైల్)

హుజూర్‌నగర్ / సూర్యాపేట క్రైం, జూన్ 27: భార్య కడుపులో పెరుగుతున్నది ఆడపిల్ల అని తెలిసి గర్భస్రావం చేయించేందుకు సిద్ధపడ్డాడా భర్త! ఏడో నెలలో అబార్షన్ చేస్తే తల్లిప్రాణాలకే ప్రమాదమని వైద్యులు హెచ్చరించినా అతడి మనసు మారలేదు! తెలిసిన ఆర్ఎంపీ సాయంతో.. ఓ వైద్యుణ్ని సంప్రదించి.. అతడి మామిడితోటలో దొంగచాటుగా అబార్షన్ చేయించాడు. ఈ క్రమంలో తీవ్ర రక్తస్రావమై ప్రాణాలు కోల్పోయిందా అభాగ్యురాలు!! సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిందీ విషాదం. తమకు తెలియకుండా తమ కుమార్తెకు అల్లుడు ఆపరేషన్ చేయించడాన్ని ఆగ్రహిస్తూ తల్లిదండ్రులు గురువారం సూర్యాపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగుచూసింది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం గ్రామపంచాయతీ ఆవాసం రాముతండాకు చెందిన సుహాసిని(26)కి చివ్వెంల మండలం ఎంజీనగర్‌తండాకు చెందిన రత్నావత్ హరిసింగ్‌తో ఆరేళ్లక్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హరిసింగ్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాదిన్నర కిందట సుహాసిని గర్భవతి కాగా.. లింగనిర్ధారణ పరీక్ష చేయించాడు. ఆమె గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలియగానే అబార్షన్ చేయించాడు. ఇటీవల ఆమె మరోసారి గర్భం దాల్చడంతో మళ్లీ స్కానింగ్ తీయించాడు. కడుపులో ఉన్నది ఆడశిశువు అని నిర్ధారణ కావడంతో మరోసారి అబార్షన్ చేయించేందుకు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యురాలు.. ఏడు నెలల గర్భం ఉన్న పరిస్థితుల్లో అబార్షన్ చేయడం వీలు పడదన్నారు. అయినప్పటికీ హరిసింగ్ ఊరుకోలేదు. ఓ ఆర్ఎంపీ సహాయంతో భార్య సుహాసినిని తీసుకుని హుజూర్‌నగర్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. ఆమెకు అబార్షన్ చేసేందుకు ఓ వైద్యుడిని ఒప్పించారు. హుజూర్‌నగర్ పట్టణ సమీపంలో.. ఆ వైద్యుడికి చెందిన మామిడి తోటలో ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో ఈ నెల 25వ తేదీన రాత్రిపూట సుహాసినికి అబార్షన్ చేస్తుండగా తీవ్ర రక్తస్రావమైంది. పరిస్థితి విషమిస్తుండటంతో ఆమెను తొలుత కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా వైద్యులు పరిస్థితి బాగాలేదని చెప్పడంతో.. ఖమ్మం తీసుకెళ్లారు. అక్కడినుంచి తిరిగి సూర్యాపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ఆమె మృతి చెందింది. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపకుండా అదే రోజు మృతదేహాన్ని ఎంజీనగర్‌తండాకు తీసుకెళ్లాడామె భర్త.

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు..

సుహాసిని మృతి విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఎంజీనగర్ తండాకు వెళ్లారు. తమకు తెలియకుండా తమ కుమార్తెకు ఎలా ఆపరేషన్ చేయిస్తావంటూ అల్లుడితో గొడవపడ్డారు. ఆపరేషన్ చేసిన వైద్యుడిని నిలదీసేందుకు సుహాసిని తల్లిదండ్రులు, బంధువులు హుజూర్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్యుడు లేకపోవడంతో సిబ్బందితో గొడవపడ్డారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో సూర్యాపేట పట్టణానికి వచ్చి స్థానిక ఏరియా ఆసుపత్రిలో సుహాసిని మృతదేహాన్ని ఉంచారు. అనంతరం.. సుహాసిని భర్తపైన, ఆపరేషన్ చేసిన వైద్యుడిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తే టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు వారి ఫిర్యాదు తీసుకుని.. బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆ తర్వాత.. చట్ట విరుద్ధంగా అబార్షన్ చేసిన హుజూర్‌నగర్ వైద్యుడితో పాటు, ముగ్గురు ఆర్ఎంపీలు, ఆసుపత్రి అటెండర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

'శ్రీశైలం'లో యూనిట్-4కు మరమ్మతులు!

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జెన్‌కో చర్యలు

త్వరలో టెండర్లు నిర్వహించేందుకు కసరత్తు

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలోని 4వ యూనిట్‌కు మరమ్మతులు చేపట్టేందుకు జెన్‌కో చర్యలు చేపట్టింది. శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో 150 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన 6 యూనిట్లు ఉన్నాయి. 2020 ఆగస్టు 20న జలవిద్యుత్ కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకోగా.. తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. ప్రమాదంలో కొన్ని యూనిట్లు పూర్తిగా, మరికొన్ని యూనిట్లు పాక్షికంగా కాలిపోయాయి. 4వ యూనిట్‌కే అత్యధిక నష్టం వాటిల్లింది. దీనికి జర్మనీ కంపెనీ వైత్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. గత ఏడాది జూలైలో 80 గంటలపాటు విద్యుదుత్పత్తి చేసిన తర్వాత ఫాల్ట్ రావడంతో 4వ యూనిట్ మళ్లీ కాలిపోయింది. డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లోనే కాలిపోయినందున ఒప్పందం ప్రకారం సొంత ఖర్చుతో మరమ్మతు చేయాలని 'వైత్' గ్రూపును జెన్‌కో కోరగా, ఆ సంస్థ నిరాకరించింది. 4వ యూనిట్‌కు ఇతర మరమ్మతులు నిర్వహించడం వల్లే ఫాల్ట్ ఏర్పడిందని, తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది. ఏడాదిపాటు ఈ వివాదం నడవడంతో మరమ్మతుల అంశం మరుగున పడిపోయింది. అయితే, ఈ విషయమై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం.. మరమ్మతులు చేపట్టాలని జెన్‌కోను ఆదేశించింది. మరమ్మతులకు రూ.3కోట్లు మాత్రమే ఖర్చు కానుండగా, అంతకు ఎన్నో రెట్లు విలువైన జల విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవచ్చన్న అంశాన్ని ప్రస్తావించింది. దీంతో మళ్లీ కొత్తగా టెండర్లు నిర్వహించడానికి జెన్‌కో యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. అయితే, మరమ్మతులు పూర్తయి 4వ యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభం కావడానికి కనీసం మూడు నెలలు పడుతుందని, ఆలోగా కృష్ణాలో వరదలు తగ్గుముఖం పడుతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

అమెరికాలో తెలుగోళ్ల హవా

» అగ్రరాజ్యంలో పెరుగుతున్న మనోళ్ల సంఖ్య
» 8 ఏళ్లలో నాలుగు రెట్ల పెరుగుదల
» 2016లో 3.2 లక్షలు.. 2024లో 12.3 లక్షలు
» ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగుది 11వ స్థానం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో తెలుగు.. వీధిలో తెలుగు.. యూనివర్సిటీలో తెలుగు.. కార్యాలయంలోనూ తెలుగే.. ఇదేదో ఆంధ్రానో, తెలంగాణో అనుకుంటే పొరబడినట్టే! అగ్రరాజ్యం అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో ఇటీవలికాలంలో కనిపిస్తున్న పరిస్థితి ఇది. ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగు 11వ స్థానంలో నిలిచింది. అమెరికాలో ఎక్కువగా మాట్లాడే భారతీయ భాషల జాబితాలో మనకన్నా ముందు హిందీ, గుజరాతీ ఉన్నాయి. కొన్నేళ్లుగా.. ఉన్నత విద్య, ఉపాధి కోసం ఇతర దేశాల నుంచి అమెరికాకు చేరుకుంటున్నవారిలో తెలుగువారి జనాభా గణనీయంగా పెరుగుతోంది. అమెరికా ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని అధికారికంగా స్పష్టం చేస్తున్నాయి. 2016తో పోలిస్తే 2024లో అమెరికాలో ఉంటున్న తెలుగువారి జనాభా నాలుగింతలు పెరిగిందని ఇటీవలే విడుదలైన యూఎస్ సెన్సస్ బ్యూరో డేటా చెబుతోంది. ఆ నివేదిక ప్రకారం..

- 2016లో అమెరికాలో తెలుగు మాట్లాడేవారి సంఖ్య 3.2 లక్షలు ఉండగా..ఇప్పుడది 12.3 లక్షలకు చేరింది.
- తెలుగు జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో కాలిఫోర్నియా ప్రథమస్థానంలో ఉంది. అక్కడ 2 లక్షల మంది తెలుగువారున్నారు. తర్వాతటెక్సస్(1.5 లక్షలు), న్యూజెర్సీ(1.1లక్షలు), ఇల్లినాయ్(83 వేలు), వర్జీనియా(78వేలు), జార్జియా(52 వేలు) ఉన్నాయి.
- అమెరికాకు ఏటా వచ్చే మొత్తం విదేశీ విద్యార్థుల్లో తెలుగు విద్యార్థుల వాటా దాదాపు 13 శాతం.
- ఉపాధి కోసం వెళ్లేవారి సంఖ్యలోనూ ఏటా వృద్ధి నమోదవుతోంది. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ నుంచి అత్యధికులు అమెరికాకు వెళ్తుండగా.. వీరిలో సింహభాగం తెలుగు రాష్ట్రాల నుంచే ఉంటున్నారు.
- అమెరికాలోని అనేక ప్రముఖ వర్సిటీల్లోని విదేశీ విద్యార్థుల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థుల వాటా పెరుగుతోంది. కెంట్ స్టేట్ వర్సిటీలో మనోళ్ల ప్రవేశాలు ఎక్కువగా ఉండడంతో 'విద్యార్థులకు స్వాగతం' అంటూ తెలుగులో ఆహ్వానం పలకడం పట్ల మన విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
- ఏటా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 60 వేల నుంచి 70 వేల మంది విద్యార్థులు, 10 వేల మందికి పైగా హెచ్1బీ వీసాపై అమెరికాకు చేరుకోవడమే అక్కడ మన హవా ఇంతగా పెరడగానికి ప్రధాన కారణం. ఇండియన్ మొబిలిటీ రిపోర్ట్-2024 ప్రకారం.. చదువుకోవడానికి అమెరికా వెళ్తున్న భారతీయ విద్యార్థుల్లో మన తెలుగువారి వాటా ఏకంగా 12.5 శాతం!!

మాతృ భాష	2010	2021	వృద్ధి (శాతం)
తెలుగు	217641	459836	111.00%
తమిళం	181698	341396	88.00%
బెంగాలీ	221872	403024	82.00%
నేపాలీ, మరాఠీ, ఇండో-ఆర్యన్ భాషలు	275694	447811	63.00%
హిందీ	609395	864830	42.00%
మళయాళం, కన్నడ, ఇతర ద్రావిడ భాషలు	197550	280188	42.00%
ఉర్దూ	388909	507972	31.00%
పంజాబీ	243773	318588	31.00%
గుజరాతీ	356394	436909	23.00%

వృద్ధిరేటులో మనమే..

అమెరికాలో ఉండే అన్ని దేశాలవారు, జాతులవారు బయట మాట్లాడేది ఆంగ్లమైనా.. ఇంట్లో మాట్లాడేది మాత్రం మాతృభాషే. అలా ఆ దేశంలో ఉంటున్న భారతీయుల్లో.. ఇంట్లో మాతృభాష మాట్లాడే వారి సంఖ్య పెరుగుదలలో తెలుగువారిదే అగ్రస్థానం. 2010లో అక్కడ 2.17 లక్షల మంది ఇంట్లో తెలుగు మాట్లాడుతుండగా.. 2021 నాటికి వారి సంఖ్య 111 శాతం వృద్ధి రేటుతో 4.59 లక్షలకు చేరింది

ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 27 : ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చట్టాన్ని అమలు చేయాలని పీడీఎస్‌యూ కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో గురువారం జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు అడ్డూ అదుపు లేకుండా వ్యవహరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో ఎల్‌కేజీ నుంచి లక్షల రూపాయల ఫీజులను వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. టెక్నో, ఈటెక్నో, ఐఐటీల తోకలతో బోర్డులను ఏర్పాటు చేసినా విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు.విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు నమోదు చేస్తున్నారని, విద్యాసంస్థల్లోనే పాఠ్యపుస్తకాల అమ్మకాలు మొదలు పెట్టి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు లోకిని రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సురక్ష, జీవనజ్యోతి బీమా చెక్కుల అందజేత

గంభీరావుపేట, జూన్ 27 : గంభీరావుపేట మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు చేతుల మీదుగా సురక్ష, జీవనజ్యోతి చెక్కులను గురువారం అందజేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఖాతా ఉండి మృతి చెందిన ముగ్గురు కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. ఎ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

సంస్కృత కళాశాల విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

వేములవాడ కల్చరల్, జూన్ 27:వేములవాడ రాజరాజేశ్వర సంస్కృత కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులు గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా రాజన్న ఆలయాన్ని సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ మల్లారెడ్డి ఆదేశాల మేరకు చరిత్ర అధ్యాపకుడు సందవేని తిరుపతి రాజన్న ఆలయ మహత్యం, చరిత్ర, దేవాలయాల ప్రాశస్త్యాన్ని వివరించారు. ప్రధాన ఆలయంలోని విశేషాలను, చారిత్రక ప్రాధాన్యతలను వివరిస్తూ విద్యార్థులో క్షేత్రపర్యటన విజయవంతం చేశారు.

తైబజార్ వసూలుకు వేలం

ఎల్లారెడ్డిపేట, జూన్ 27: ఎల్లారెడ్డిపేటలో తైబజార్ వసూలుకు గురువారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో సత్తయ్య ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు తైబజార్ వసూలుకు నిర్వహించిన వేలంలో జవ్వాజి రామస్వామి, దేశపాండి మల్లేశం పాల్గొనగా రూ 3.70 లక్షలకు జవ్వాజి రామస్వామి దక్కించుకున్నారు. ఎంపీవో వజీర్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శి దేవరాజు, మాజీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలి

ఎల్లారెడ్డిపేట, జూన్ 27: కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని, ప్రభుత్వ పథకాలు ప్రజల దరి చేరేలా చూడాలని టీపీసీసీ అధికార ప్రతినిధి, పార్టీ రాష్ట్ర మీడియా సెల్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలోని జంగ ఆంజిరెడ్డి ఇంటిలో గురువారం జరిగిన ఓ శుభకార్యానికి హాజరయ్యారు. సిరిసిల్ల నియోజక వర్గంలోని సమస్యలను నాయకులు, కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. అధికారం కట్టబెట్టిన ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందించేలా చూడాలన్నారు. పార్టీలో భేదాభిప్రాయాలకు చోటు ఇవ్వకుండా పటిష్టతకు పాటు పడాలన్నారు. కష్టపడే కార్యకర్తలను పార్టీ గుర్తించి పదవులను కట్టబెడుతోందన్నారు. కలిసి మెలిసి పని చేసి ప్రజల మెప్పు పొందాలన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చాగౌడ్, రాజేందర్, రాజునాయక్, బాలుయాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, బాలయ్య, తిరుపతిరెడ్డి, రవి, రాంరెడ్డి, సుధాకర్ ఉన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన నాయకులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 27: ఎల్లారెడ్డిపేట మండలంలోని బీజేపీ నాయకులు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణను వేములవాడలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల గుండెకు సంబంధించి చికిత్స పొందిన రామకృష్ణ ఆరోగ్యపరిస్థితి అడిగి తెలుసుకున్నారు. నాయకులు ప్రదీప్‌రెడ్డి, గాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదానికి గురైన మాజీ సర్పంచ్ వాహనం

ఎల్లారెడ్డిపేట, జూన్ 27: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ నేవూరి వెంకటరెడ్డి వాహనం హైదరాబాద్‌లో గురువారం రోడ్డు ప్రమాదానికి గురైంది. వాహనం ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. వాహనంలోని బెలూన్స్ తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, మరో వ్యక్తి ప్రమాదం నుంచి బయట పడ్డారు.

చొప్పదండి ఎమ్మెల్యేకు పరామర్శ

గంభీరావుపేట, జూన్ 27 : చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను అల్వాల్‌లోని ఆయన నివాసంలో గంభీరావుపేట మండలానికి చెందిన దళిత సంఘాల నాయకులు గురువారం పరామర్శించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి ఇటీవల ఆత్మహత్య చేసుకున్నారు. దళిత సంఘం నాయకులు ఎగదండి స్వామి, మాజీ సర్పంచ్ ఎడబోయిన రాజు, సింగిల్ విండో డైరెక్టర్ మల్యాల రాజవీర్ తదితరులు ఉన్నారు.

క్రీడా ప్రాంగణం కబ్జాకు యత్నం

బీర్‌పూర్, జూన్ 27: బీర్‌పూర్ గ్రామ ప్రజలు విరాళాలు సేకరించి కళాశాల కోసం కొన్న స్థలాన్ని బుధవారం రాత్రికి రాత్రే కబ్జా చేసేందుకు దున్నినట్లు బీర్‌పూర్ యువ చైతన్య యూత్ సభ్యులు గురువారం గుర్తించారు. గతంలో బీర్‌పూర్ మండలానికి నూతనంగా కళాశాల మంజూరు కాగా కళాశాల భవనం కోసం గ్రామంలో విరాళాలు సేకరించి బీర్‌పూర్ శివారులోని ఆసునూరి గూడెం వద్ద రెండెకరాల భూమిని కొన్నారు. అధికారులు నాయకులు సమాలోచనతో గంగసముద్రంలో ఉన్న భవణంలోనికి కళాశాలను తరలించారు. కళాశాల కోసం కొన్న స్థలం కాళీగా ఉండడంతో గత ప్రభుత్వం అన్ని గ్రామాలలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసిన విధంగానే బీర్‌పూర్ మండల కేంద్రంలో కూడా కళాశాల కోసం ఏర్పాటు చేసిన స్థలంలో కేవలం క్రీడా మైదానం అని బోర్డు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. స్థలం కాళీగా ఉంటుందని గమనించిన కబ్జాదారులు రాత్రికి రాత్రే దున్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేసినట్లు యూత్ సభ్యులు ఆరోపిస్తున్నారు.

మద్యానికి బానిసై ఒకరి మృతి

మెట్‌పల్లి, జూన్, 27: మద్యానికి బానిసై షేక్ అన్వర్ (38) మెట్‌పల్లి పట్టణంలో మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన షేక్ అన్వర్‌కు పట్టణంలోని మహిళతో వివాహమైంది. అన్వర్ మద్యానికి బానిస కావడంతో భార్య వదిలి మెట్‌పల్లిలోని తల్లిగారింటికి 15 ఏళ్ల క్రితం వచ్చింది. దీంతో అన్వర్ ఒంటరి జీవితం భరించలేక మెట్‌పల్లికి వచ్చాడు. బుధవారం రాత్రి వర్షం కురిసిన సమయంలో పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలోని జాతీయ రహదారిపై పడి మృతి చెందాడు. స్థానికులు 108కు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

వర్షంతో ఉపశమనం

- మత్తడి దూకిన చెరువు
- పెరిగిన నక్కవాగు ప్రవాహం
- కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు



మల్యాలలో మత్తడి దూకుతున్న వెంగల చెరువు

సిరిసిల్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం సాయంత్రం వర్షం ఆహ్లాదాన్ని నింపింది. ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించింది. సాయంత్రం సిరిసిల్లలో 5.5 మిల్లీమీటర్ల వర్షం, వేములవాడలో 2.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కురిసిన వర్షానికి రోడ్లపై వరద ప్రవహించింది. బుధవారం సాయంత్రం నుంచి గురువారం తెల్లవారు జాము వరకు 43.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చందుర్తిలో 104.9 మిల్లీ మీటర్లు కురిసింది. అతి తక్కువగా రుద్రంగిలో 13.9 మిల్లీమీటర్లు నమోదైంది. వేములవాడ రూరల్‌లో 53.0, బోయినపల్లి 25.8, వేములవాడ 38.4, సిరిసిల్ల 26.0 వీర్నపల్లి 75.6, ఎల్లారెడ్డిపేట 24.4, గంభీరావుపేట 14.6, తంగళ్లపల్లి 68.9, ఇల్లంతకుంటలో 51.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

వేములవాడ రూరల్/ చందుర్తి: చందుర్తి మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు పలు దఫాలుగా మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. మల్యాలలోని వెంగల చెరువు మత్తడి దూకింది. గ్రామాల్లో వాగులు, ఒర్రెలు ఉధృతంగా ప్రవహించాయి. వరద నీరు పోటెత్తింది. భారీ వర్షంతో రహదారులు జలమ యమయ్యాయి.

● రెండు రోజులుగా వేములవాడ మండలంలో మోస్తరు వర్షం కురుస్తోంది. దీంతో హన్మాజిపేటలో నక్కవాగు ప్రవాహం పెరిగింది. నక్కవాగుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం తాత్కాలికంగా మట్టి రోడ్డు ఏర్పాటు చేశారు. వర్షంతో నక్క వాగు ప్రవహిస్తుండడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు కొట్టుకుపోయింది. రోడ్డు కొట్టుకు పోవడంతో రాక పోకలు నిలిచిపోయాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాకపోకలకు అధికారులు ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నక్కవాగు ప్రవాహానికి కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు

మూలవాగు కష్టాలు తీరేనా?

- కొట్టుకుపోయిన కాజ్‌వేలు
- వర్షాకాలం రాకపోకలు బంద్





బాపుసాయిపేట- వెంకట్రావుపేట మధ్య మూలవాగులో తాత్కాలిక మొరం రోడ్డు, మామిడిపల్లి-నిజామాబాద్ మధ్య మూలవాగులో తాత్కాలిక మరమ్మతు

కోనరావుపేట, జూన్ 27 : కోనరావుపేట మండల వాసులకు మూలవాగులో కష్టాలు తీరడం లేదు. ఐదు సంవత్సరాల క్రితం కాజ్‌వేలు కొట్టుకుపోవడంతో అప్పటి నుంచి ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదు. కోనరావుపేట మండలంలోని వట్టిమల్ల, నిమ్మపల్లి, బాపుసాయిపేట, వెంకట్రావుపేట, మామిడిపల్లి, నిజామాబాద్ గ్రామాల మీదుగా మండలానికి వెళ్లడానికి మూలవాగులో గత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మంత్రి జీవన్ రెడ్డి ప్రోత్సాహంతో కాజ్‌వేల నిర్మాణం చేపట్టారు. అప్పుడు నిర్మించిన కాజ్‌వేలు ఐదేళ్ల క్రితం మూలవాగు వరద తాకిడికి కొట్టుకు పోయాయి. అప్పటి నుంచి తాత్కాలిక మరమ్మతు చేపడుతున్నారు తప్ప శాశ్వత పరిష్కారానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. దీంతో తాత్కాలికంగా మూలవాగులో ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు ఏటా మూలవాగు వరద తాకిడికి కొట్టుకు పోతోంది. దీంతో మండల వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. మూలవాగు పారడంతో మండల వాసులకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదవీకాలం ముగిసే సమయంలో రూ. 52 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కానీ పనులు మాత్రం ఇప్పటివరకు చేపట్టలేదు. వర్షాకాలం ప్రారంభం కావడంతో మూలవాగు కష్టాలు మళ్లీ మొదలవుతున్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలోనైనా నిధులు మంజూరు చేసి మూలవాగులో శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

విద్యార్థుల సస్పెన్షన్ సరికాదు



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సిరిసిల్ల రూరల్, జూన్ 27: నిరసన తెలిపిన విద్యార్థులను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సస్పెన్షన్ చేయడం సరైంది కాదని, తిరిగి యూనివర్సిటీలో చేర్చుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హైదారాబాద్ సెంట్రల్ యూనవర్సిటీ వైస్‌చాన్స్‌లర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ యూనివర్సిటీలోని వీసీ గెస్ట్‌హౌస్ ఎదుట స్టూడెంట్ యూనియన్ హక్కుల కోసం నిరసన తెలిపినందుకు స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడు, మాజీ విద్యార్థి సంఘం నాయకులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను క్యాంపస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లుగా ప్రకటించడం బాధాకరమన్నారు. సస్పెండ్ అయిన విద్యార్థులు పూర్తి నిరుపేదలని, ప్రభుత్వం నుంచి వచ్చేస్కాలర్‌షిప్‌లతోనే చదువుకుంటున్నారని అన్నారు. ఇప్పటికైనా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ స్పందించాలని, సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనిల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేష్, నాయకులు భరత్, మురారి, సాయి, అభి, అదిత్య, తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

మెట్‌పల్లి రూరల్, జూన్ 27: మండలంలోని వెల్లుల్ల గ్రామానికి చెందిన జుంగుల గంగాధర్ గౌడ్ (52) అనే గీత కార్మికుడు తాటి చెట్టు పైనుంచి జారి పడి గురువారం మృతి చెందాడు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర్‌గౌడ్ కల్లు గీసి అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం ఉదయం గ్రామ శివారులో కల్లు తీయడానికి చెట్టెక్కాడు. ఈ క్రమంలో చెట్టు పైనుంచి కిందికి దిగుతున్న సమయంలో మోకు జారడంతో గంగాధర్ జారి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుటుంబసభ్యులు, 108కు సమాచారం అందించారు. మెట్‌పల్లిలో ఉన్న అంబులెన్స్ సమయానికి రాక పోవడంతో కోరుట్లకు చెందిన 108లో గంగాధర్‌ను మెట్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు ధృవీకరించారు. గంగాధర్‌కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కొడుకు రాకేష్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్ల రూరల్, జూన్ 27: ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రావిడెంట్ ఫండ్ సమస్యలను పరిష్కరించాలని, న్యాయం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి కోరారు. సిరిసిల్ల జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం సీఈవో ఉమారాణిని కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా సీఈవో స్పందిస్తూ పార్ట్ 2వ లిస్ట్‌ను తొందరలోనే అప్రూవ్ చేయనున్నట్లు చెప్పారని, పదవీ విరమణ చెందిన వారికి సెటిల్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారని అన్నారు. ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన 76 మంది ఉపాధ్యాయుల్లో 36 మంది ఉపాధ్యాయులకు జీపీఎఫ్ అకౌంట్‌లు షిఫ్ట్ చేశామన్నారని, మిగతా 40 మంది కోసం లిస్ట్ తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దోర్నాల భూపాల్‌రెడ్డి, రాంనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్‌వోసీ మంజూరు

చందుర్తి, జూన్ 27: చందుర్తి మండలం మరిగడ్డ గ్రామానికి చెందిన పోతారం పవన్ కుమార్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రిలో మెరుగైన చికిత్స కోసం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సీఎంఆర్‌ఎఫ్ కింద రూ. 2 లక్షల 10 వేలు ఎల్‌వోసీని గురువారం మంజూరు చేయించారు. సీఎంఆర్ కింద ఎల్‌వోసీ మంజూరు చేయించినందుకు ఆది శ్రీనివాస్‌కు గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు శీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

వైభవం.. వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం



అమ్మవారికి తలంబ్రాలు పోస్తున్న కన్యాదాతలు

వేములవాడ కల్చరల్, జూన్ 27: వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన వేణుగోపాల స్వామి ఆలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న అధ్యయనోత్సవాలు ముగిసాయి. గురువారం ఉదయం 6.30 గంటలకు అర్చకులు స్వామి వారికి పంచోపనిషత్ అభిషేకం, అర్చనలు చేశారు. వేద మంత్రాల మధ్య రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణం నిర్వహించారు. బురుగడ్డ అనుషకిషన్ దంపతులు కన్యాదాతలుగా వ్యవహరించారు. రాత్రి 8.30 గంటలకు స్వామివారి ఏకాంత సేవ నిర్వహించారు. ఏఈవోలు హరికిషన్, పర్యవేక్షకులు గుండి హరిహరనాథ్, నక్క తిరుపతి, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎల్లారెడ్డిపేట, జూన్ 27: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ శివారులో పట్టుకున్నామని ఎస్సై రమాకాంత్ గురువారం తెలిపారు. గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నారని, వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు పట్టుబడ్డాయని పేర్కొన్నారు. వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన వాహన డ్రైవర్లు, యజమానులు దీపక్, విజయభాస్కర్‌రెడ్డి, దుర్గయ్య సంతోష్‌పై కేసు నమోదు చేశామన్నారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామ ఎస్సై రమాకాంత్ హెచ్చరించారు.

సబ్సిడీ చెల్లించకుంటే పోరాటం కొనసాగిస్తాం



సమావేశానికి హాజరైన కార్మికులు

సిరిసిల్ల రూరల్, జూన్ 27: సబ్సిడీ చెల్లించకుంటే పోరాటం కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. బతుకమ్మ చీరల ఉత్పత్తికి సంబంధించి పవర్‌లూం కార్మికులకు రావాల్సిన పది శాతం యారన్ సబ్సిడీ చెల్లింపు జాప్యంపై సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నేతన్న దీక్షను తాత్కలికంగా వాయిదా వేశారు. గురువారం సిరిసిల్ల చేనేత జౌళి శాఖ కార్యాలయం ముందు సీఐటీయూ పిలుపు మేరకు కార్మికులు తరలివచ్చారు. నూతనంగా చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టిన శైలజరామయ్యార్ ఫోన్ ద్వారా హామీ ఇచ్చారు. కార్మికులందరికి రెండుమూడు రోజుల్లో డబ్బులు జమ చేయనున్నామని, విడుదల అయ్యాయని తెలిపారు. హామీ మేరకు దీక్షను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. కార్మికులందరూ జౌళి శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో డబ్బులు జమ కానీ పక్షంలో మళ్లీ పెద్ద ఎత్తున పోరాటాలు కొనసాగిస్తామన్నారు. జూలై 7 నుంచి 17వరకు రాష్ట్ర వ్యాప్త నేతన్న పోరు యాత్రను విజయవంతం చేయాలన్నారు. సిరిసిల్లలో యాత్ర ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణేష్, నక్క దేవదాస్, రమేష్, చంద్రకాంత్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

గార్మెంట్ కార్మికులకు ఉపాధి కల్పించాలి

గార్మెంట్ రంగంలో ఉపాధి లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, ఉపాధి కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గార్మెంట్ రంగంలో పనిలేక ఇబ్బంది పడుతున్న కార్మికుల కోసం పని కల్పిస్తున్నామని, అపెరల్ పార్కులో కొద్దిమందికి పని కల్పించారని మిగతా వారిని పట్టించుకోవడం లేదని అన్నారు. మిగతావారికి పని కల్పించాలని కోరారు. ఉపాధి కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకవెళ్లే దిశగా జూలై 1న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి కమలాకర్ పాల్గొన్నారు.

రాజన్న కోడెలకు వైద్య పరీక్షలు



వ్యాక్సిన్ వేస్తున్న వైద్యుడు

వేములవాడ టౌన్, జూన్ 27:వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ గోశాలలోని కోడెలకు గురువారం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు ఆదేశాల మేరకు తిప్పాపూర్‌లోని గోశాల కోడెలకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యులు ప్రశాంత్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో 20 మంది వైద్యులు, 10 మంది సిబ్బంది 1500 కోడెలకు పరీక్షలు నిర్వహించారు. అనారోగ్య సమస్యలున్న కోడెలకు వ్యాక్సిన్లు మందులు వేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు ప్రతాప నవీన్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్‌లు పర్యవేక్షకుడు నాగుల మహేష్ ఉన్నారు.

కుక్క దాడిలో పలువురికి గాయాలు

వేములవాడ టౌన్, జూన్ 27: వేములవాడ పట్టణంలోని విశ్వబ్రాహ్మణ వీధిలో పలువురిపై కుక్కదాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు కాలనీవాసులు తెలిపారు. విశ్వబ్రాహ్మణ వీధిలో ఓ బాలుడిపై కుక్క దాడి చేయగా తీవ్రంగా గాయాలయ్యాయి. హుటాహుటిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి సిరిసిల్ల ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మున్సిపల్ సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బందితోపాటు కాలనీకి చెందిన మరో వ్యక్తిపై కూడా గురు వారం కుక్క దాడి చేయడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జూన్ 27: దేశవ్యాప్తంగా జూలై 1న ఉంచి అమలులోకి వస్తున్న నూతన చట్టాలపై ప్రతీ ఒక్కరు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో అన్ని పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలతో నేర సమీక్షపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలు కానున్న భారతీయ న్యాయ 'సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ)పై ప్రతీ పోలీసు అధికారి, సిబ్బందికి అవగాహన కలిగి ఉండాలనే శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. కొత్త చట్టాలు అమలైన వెంటనే సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్‌లపై తెలిసి ఉండాలన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధి విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించేందుకు వీలు ఉంటుందని అన్నారు. అధికారులు, సిబ్బంది కొత్త చట్టాలను నేర్చుకొని అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రజల్లో నమ్మకం, భద్రతపై విశ్వాసం కలిగించేందుకు విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కి వచ్చే ప్రదా ఫిర్యాదుసా తక్షణమే స్పందించాలనిం, చట్ట ప్రకారం న్యాయం చేయాలని అన్నారు. పోలీస్‌స్టేషన్‌ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, వాటి పురోగతి, పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలను సంబంధిత అధికారి ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి చొరవ చూపించాలని, వాటి సంఖ్యను తగ్గించేలా కృషి చేయాలని అన్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించాలని, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని అన్నారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు బారికేడ్లు, సైన్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, రబ్బర్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించాలన్నారు. ప్రాసిక్యూషన్‌లో భాగంగా కోర్టువారు జారీచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై అమలు పర్చడానికి కృషిచేయాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై నిఘా ఉంచాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై పటిష్టమైన నిఘా ఏర్పరిచి కఠినంగా వ్యవహరించాలన్నారు. మీ కోసం కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ రూల్స్, సైబర్ నేరాలు, షీటీమ్స్‌పై గ్రామీణులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గత నెలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 22మంది పోలీసు అధికారులకు, సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు చంద్రశేఖర్ రెడ్డి, సర్వర్, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

దేశంలోనే అగ్రగామిగా సహకార వ్యవస్థ



కార్యక్రమంలో మాట్లాడుతున్న రవీందర్‌రావు

ఎల్లారెడ్డిపేట, జూన్ 27: సహకార వ్యవస్థ దేశంలోనే అగ్రగామిగా నిలిచి దిక్సూచిగా మారిందని నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ శివారులోని సర్వేయపల్లిలో ప్యాక్స్ ఆధ్వర్యంలో రూ.50 లక్షల నాబార్డు నిధులతో ఏర్పాటు చేసిన పెట్రోలు బంకును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ సహకార పరపతి సంఘాలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో అన్ని రంగాల్లో ముందుండేలా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. గతంలో సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోలు బంకులకు కేంద్ర ప్రభుత్వాలు సబ్సిడీని ఎత్తివేయడంతో మూత పడ్డాయన్నారు. కోర్టును ఆశ్రయించి పునః ప్రారంభించుకున్నామని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి మంత్రిగా అమిత్‌షాను నియమించడంతో సహకార సంఘాల అభ్యున్నతికి కృషి చేయాలని కోరామన్నారు. సహకార సంఘాలు రైతులకే కాకుండా అన్ని వర్గాలకు చేరువయ్యేలా చట్టాలను రూపొందించి వ్యాపార రంగంలో అడుగు పెట్టేలా అమిత్‌షా చర్యలు తీసుకున్నారన్నారు. పెట్రోలియం శాఖ మంత్రితో చర్చించి సహకార సంఘాలు పెట్రోలు, డీజిల్ బంకుల ఏర్పాటుకు కృషి చేశారన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి పౌర సరఫరా శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో సంఘాలు ధాన్యం కొనుగోళ్లను చేపట్టాయన్నారు. సహకార సంఘాల ద్వారా కొనుగోళ్లతోపాటు శుద్ధ జలం, వాటర్ బాటిళ్ల తయారీ తదితర 200 సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సహకార సంఘాల ఆధ్వర్యంలో 40 పెట్రోలు బంకులు నడుస్తున్నాయన్నారు. అన్నదాతలతోపాటు అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధికి పాటు పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ సత్తయ్య, ఎంపీటీసీలు గీతాంజలి, మల్లేశం, మధు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, మండల కో-ఆప్షన్ సభ్యుడు జబ్బార్, భారత్ పెట్రోలియం సంస్థ సేల్స్ ఆఫీసర్ శరంజిత్, జిల్లా సహకార కార్యాలయం అసిస్టెంట్ రిజిష్టర్ చాంద్‌పాషా, ఆయా మండలాల ప్యాక్స్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.